# 'తూర్పు' అభివృద్ధే లక్ష్యం

- ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులు కల్పిస్తున్నా
- రూ. 77 కోట్లతో వరద కాల్వల నిర్మాణం
- ముంపు కాలనీల్లో మెరుగైన సౌకర్యాలు
- మైనార్టీల సంక్షేమానికి కృషి
- తూర్పు ఎమ్మెల్యే నరేందర్
- నన్నపునేని సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు



కార్యకర్తలకు గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్ చౌరస్తా, నవంబర్ 6: వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ 36వ డివిజన్ చింతల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఇతర పార్టీల నేతలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, ప్రతి డివిజన్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో 36వ డివిజన్ పరిధిలోని చింతల్ పుప్పాలగుట్ట ప్రాంతంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించామన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మైనార్టీలకు తూర్పు నియోజకవర్గంలో నాలుగు స్థానాలు కేటాయించడంతోపాటు అండర్ రైల్వేగేట్ ప్రాంతానికి చెందిన పేద, మధ్య తరగతి మైనార్టీ కుటుంబాల కోసం షాదీఖాన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మైనార్టీ గురుకుల పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తా నన్నారు. వరద ముంపు నివారణకు సుమారు రూ. 77 కోట్లతో కాల్వ నిర్మాణం పనులు చేపట్టామని, త్వరలోనే పూర్తి కానున్నట్లు వెల్లడించారు. పనులు పూర్తయితే వరద ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. వరంగల్ నగరాన్ని బీఆర్‌ఎస్ సర్కారు హెల్త్ హబ్‌గా మార్చేందుకు రూ. 1200 కోట్లతో 24 అంతస్తుల ఆధునిక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మిస్తున్నదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెల్పుగొండ యాకయ్య, మర్రి శ్రీనివాస్, రమేశ్, షమీమ్, షాబొద్దీన్, కిట్టు, అనిల్, మధు, రాజు, వెల్పుగొండ రేణుక, అంకుస్, లావణ్య, రాజేందర్, అజయ్ పాల్గొన్నారు.

### మైనార్టీలకు సీఎం కేసీఆర్ అండ

కరీమాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీలకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. శంభునిపేటలో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బీఆర్‌ఎస్‌లో మైనార్టీలకు కార్పొరేటర్ టికెట్లతోపాటు కో ఆప్షన్‌గా అవకాశం కల్పించామన్నారు. అలాగే, నియోజకవర్గంలో ఈద్గాలు, మసీదులు, ఖబ్రస్థానను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని అవకాశాలు అందిస్తామని, బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోశాల పద్మ, మైనార్టీల ఇన్‌చార్జి ఎంఏ జబ్బార్, డివిజన్ అధ్యక్షుడు ఈదుల రమేశ్, నాయకులు పోశాల స్వామి, కలకోట్ల రమేశ్, ఈదుల భిక్షపతి, హసన్ అలీ బేగ్, ముస్లిం పెద్దలు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు. అనంతరం నన్నపునేని సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో కొత్త, పాత తేడాలేకుండా నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

### గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి

రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే గౌడ కులస్తుల సంక్షేమానికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. ఉర్సులో నాగపురి సంజయ్‌బాబు అధ్యక్షతన గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గౌడ కులస్తుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలా చేయూతనిస్తున్నదన్నారు. అనంతరం గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండ వెంకన్నగౌడ్, బత్తిని హరిప్రసాద్, మాజీ కార్పొరేటర్లు నాగపురి కల్పన, నాగపురి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వీడియో ఫుటేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

### 'ప్రలోభాలపై గట్టి నిఘా కొనసాగించాలి'

వరంగల్, నవంబర్ 6: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి వినియోగించే నగదు, వస్తువుల గుర్తింపునకు నిరంతరం గట్టి నిఘా కొనసాగించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. వరంగల్ ఎంజీఎం సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని ఆమె పరిశీలించి, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ నిర్వహిస్తున్న తనిఖీల వీడియో రికార్డులను సైతం పరిశీలించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఆమె వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వెంకటరమణ ఉన్నారు.

### ఆర్వో కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

తూర్పు రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలోని ఆర్వో చాంబర్‌లో ఆమె తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వానా బాషాతో సమావేశమై నామినేషన్ల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

### మెప్మా సిబ్బందికి అవగాహన కార్యక్రమం

వరంగల్ చౌరస్తా, నవంబర్ 6: ఎన్నికల విధుల నిర్వహణ, ప్రవర్తనా నియమావళిపై మెప్మా సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు వరంగల్ ఐఎంఏ హాల్‌లో సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) నోడల్ అధికారి భాగ్యలక్ష్మి మెప్మా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలు తెలియజేశారు.

### ఓరుగల్లు సాహితీమూర్తులకు ఘన సత్కారం

పోచమ్మమైదాన్, నవంబర్ 6: సాహితీ బంధు బృందం సంస్థ సేవలు మరువలేనివని ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. సాహితీ బంధు బృందం వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఆదివారం రాత్రి డాక్టర్ జీవీ రత్నం, రామచంద్రమౌళి, గన్నమరాజు గిరిజామనోహర బాబు, డాక్టర్ లంకా శివప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 74 ఏళ్ల ఘన చరిత్రతో వర్ధిల్లుతూ ఇంకా కావ్య రచనలు కొనసాగిస్తున్న ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య సంస్థ కార్యదర్శిగా, యువ సాహిత్యకారులు కోవెల సంతోష్‌కుమార్ సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు చేపడుతూ ఓరుగల్లు కవులను సన్మానించడం అభినందనీయమన్నారు.

### సామూహిక అనఘాష్టమి వ్రతాలు

పోచమ్మమైదాన్, నవంబర్ 6: దీపావళి పర్వదినం సందర్భంగా ములుగు రోడ్డులోని శ్రీవరద దత్తక్షేత్రంలో సామూహిక అనఘాష్టమి వ్రతాలను నిర్వహించనున్నట్లు దత్తక్షేత్రం ట్రస్ట్ చైర్మన్ వైవీ వామన్‌రావు తెలిపారు. సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 10న అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామి ఓరుగల్లులోని ఆశ్రమానికి చేరుకుంటారని, సాయంత్రం స్వాగతసభ ఉంటుందన్నారు.

### విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

పోచమ్మమైదాన్, అక్టోబర్ 6: ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి పాఠశాల విద్యార్థులకు సోమవారం స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. వరంగల్‌కు మట్టెవాడ పాఠశాలకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం, దాచేపల్లి వెంకటయ్య జయంతి సందర్భంగా విద్యార్థులందరికీ ప్లేట్లు అందజేశారు. రానున్న రోజుల్లో పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్, గేమ్స్ మెటీరియల్ అందజేస్తామని హామీ ఇచ్చారు.

# బీఆర్‌ఎస్ ముమ్మర ప్రచారం

- గడపగడపకూ వెళ్లి ఓట్ల అభ్యర్థన
- అభివృద్ధిని చూసి ఓటెయ్యండి
- డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్

వరంగల్‌చౌరస్తా/కరీమాబాద్/పోచమ్మమైదాన్, నవంబర్ 6: బీఆర్‌ఎస్ శ్రేణులు తూర్పు నియోజకవర్గంలో దూసుకెళ్తున్నారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పలు డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వరంగల్ 36వ డివిజన్ చింతల్, పుప్పాలగుట్ట ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి జరుగుతున్న అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రానున్న రోజుల్లో తూర్పులో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ నన్నపునేని నరేందర్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ గెలుపు కోరుతూ 32వ డివిజన్‌లో ఆ పార్టీ నేతలు ఇంటింటా ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ నన్నపునేనిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పల్లం రవి, నాగపురి కల్పన, డివిజన్ అధ్యక్షులు పొగాకు సందీప్, నాయకులు ఎంఏ జబ్బార్, నాగపురి సంజయ్‌బాబు, బత్తుల కుమార్, తరాల రాజమణి, కొండ రాజు, మాటేటి శ్యామ్, నాగమణి, కళావతి పాల్గొన్నారు. 23వ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు వినూత్నంగా ప్రచారం చేపట్టారు. టీ స్టాల్స్, హోటల్స్, షాపులు, కూరగాయాల మార్కెట్‌లోకి వెళ్లి వారితో చేయిచేయి కలిపారు. గరం గరం చాయ్, పూరి, వడ, ఇడ్లీ చేశారు. నరేందర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని ముమ్మరంగా చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు యెలుగం సత్యనారాయణ, యెలుగం శ్రీనివాస్, నీలం రాజ్‌కిశోర్, కటకం విజయ్‌కుమార్, చిప్ప వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వరంగల్‌చౌరస్తా: 36వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్

### గులాబీ జెండా ఎగరడం ఖాయం

గిర్మాజీపేట: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన అన్నారు. నన్నపునేని గెలుపు కోరుతూ సోమవారం రాత్రి ఎల్లమ్మబజార్‌లో కొత్తగుడి శ్రీరామాంజనేయస్వామి ఆలయం నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొలిపాక శ్రీనాథ్, జగన్, నాగరాజు, సురేశ్, రత్నాకర్, శ్రవణ్, అఖిల్ పాల్గొన్నారు. అలాగే, 33వ డివిజన్ బొడ్డాయి ప్రాంతంలో బీఆర్‌ఎస్ నేత ముష్కమల్ల సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి వడ్డె కోటేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు ముద్దసాని శ్రీనివాస్, రాధిక, కావ్య, శ్రీలత, ప్రసాద్, రాజేశ్, సతీశ్ పాల్గొన్నారు.







కరీమాబాద్: 32వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు, పోచమ్మమైదాన్: కొత్తవాడలో పూరీ తయారు చేస్తున్న నాయకులు, గిర్మాజీపేట: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

### రంగలీలా మైదానం పరిశీలన

కరీమాబాద్, నవంబర్ 6: ఉర్సు రంగలీలా మైదానంలో ఈ నెల 11న జరగనున్న నరకాసుర వధ నేపథ్యంలో బందోబస్తు విషయమై సోమవారం వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, సీఐలు సురేశ్, వెంకన్న మైదానాన్ని పరిశీలించారు. గతంలో చేపట్టిన బందోబస్తు, చేయాల్సిన ఏర్పాట్లపై ఉత్సవ కమిటీతో చర్చించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి, సభ్యులు కనుకుంట్ల రవి, ఆవునూరి రామ్మూర్తి, మరుపల్ల గౌతమ్, వంగరి సురేశ్, దూడ బాలకొమురెల్లి, తౌటం నరసింహ, నాగవెల్లి రంజిత్, కొమ్ము రాజు, కంది అఖిల్ సాయి, కొమ్ము లింగమూర్తి పాల్గొన్నారు.

### నన్నపునేని వాహనం తనిఖీ

కరీమాబాద్: వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వాహనాన్ని ఎన్నికల సిబ్బంది శంభునిపేటలో తనిఖీ చేశారు. వాహనం దిగి తనిఖీ పూర్తయ్యే వరకూ ఎమ్మెల్యే వేచి ఉన్నారు.